మైమరపించిన హృదయ వీణ



ఒడిశా భక్తులు 'హృదయ వీణ' పేరిట గాన కచేరితో భక్తులను అలరింపచేశారు. రెండో రోజు ఆదివారం సాయికుల్వంత్ సభామండపంలో ఒడిశా భక్తులు కచేరి నిర్వహించారు. హృదయ వీణ పేరిట మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్య సాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

పాటలు పాడుతున్న ఒడిశా భక్తులు

నృత్యోత్సవం

పుట్టపర్తిలోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు నృత్యంతో అలరించారు. చెన్నై నవరస నాట్య కళామందిరం బాలికలు నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. పుష్పాంజలి, జతీశ్వరం, అయ్యప్పవరణం, కృష్ణ భజనకు నృత్యం చేశారు. ప్రతి ఆదివారం సాయంత్రం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ తెలిపారు.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

నృత్యం చేస్తున్న బాలికలు



సిగ్గు.. సిగ్గు..!

పరాయి భవనాల్లో విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాలు

- శిథిలావస్థకు చేరుకోవడంతో భయంభయంగా విధులు
- కనీస సౌకర్యాలు కరువు
- ఖాళీ చేయాలంటూ సంబంధిత శాఖల ఒత్తిళ్లు



వర్షం వస్తే డీఈఓ కార్యాలయంలోకి ఈ బురదలో వెళ్లాల్సిందే..

ఇది జిల్లా విద్యాశాఖ కార్యాలయం. సొంత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎయిడెడ్ పాఠశాల అయిన గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లోని గదులను తీసుకుని, అందులో కార్యాలయం నిర్వహిస్తున్నారు. అదే శాఖలో పది వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతినెలా కోట్ల రూపాయలు వారికి వేతనాలు చెల్లిస్తున్నారు. పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు తదితరాల కోసం కోట్లలోనే ఖర్చు చేస్తున్నారు. అంత కీలకమైన శాఖకు సొంత భవనం లేదు. పాలకులు, ఉన్నతాధికారులు కొత్త భవనం నిర్మించే ఆలోచన కూడా చేయకపోవడం శోచనీయం. ఏళ్లుగా అక్కడే నిర్వహిస్తుండడంతో గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల యాజమాన్యం ఖాళీ చేయాలంటూ ఒత్తిడి తెచ్చింది. ఆ మేరకు గతంలో జిల్లా విద్యాశాఖాధికారి వినతి పత్రం కూడా అందజేసింది. జిల్లా ఉన్నతాధికారితో చెప్పించుకుని, వారి దయాదాక్షిణ్యాలతో జిల్లా కార్యాలయాన్ని అక్కడే నడుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామన్న గత వైసీపీ పాలకులు.. జిల్లా కార్యాలయం కట్టలేకపోయారు. ప్రస్తుతం ఉన్న పరాయి భవనాల్లోని ఆఫీసుకు వెళ్లాలంటే వర్షం వచ్చినపుడు ఇలా బురద తొక్కుకుంటూ వెళ్లాల్సిందే.



ఇది సమగ్రశిక్ష కార్యాలయం. వేల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారికి వేతనాలు ప్రతి నెలా కోట్ల రూపాయల్లో చెల్లిస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను నిర్వహిస్తుంది. అందులో చదువుతున్న విద్యార్థులకు భోజనం, వసతుల ఖర్చుల మొత్తం సొమ్ము ఈ శాఖ ద్వారానే చెల్లిస్తారు. ప్రతినెలా ఆ బిల్లులు కోట్లలోనే ఉంటాయి. అలాంటి కీలక విభాగానికి సొంత భవనం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన రేకుల షెడ్లలో కాలం వెల్లదీస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఇక ఖాళీ చేయాలంటూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఒత్తిళ్లు వస్తుండడంతో ఎటు పోవాలోనని ఉన్నతాధికారులు దిక్కులు చూస్తున్నారు.

అనంతపురం విద్య, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం.. విద్యాప్రమాణాలు మెరుగుపరుస్తాం..' అంటూ ప్రభుత్వ పెద్దలు పదే పదే గొప్పలు చెబుతుంటారు. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం వివిధ పథకాలు తీసుకొచ్చి ఏటా రూ.కోట్లు (మిగతా 7లో...)



స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ సమత (ఫైల్)

స్వమిత్వ(సర్వే ఆఫ్ విలేజెస్ అబాడీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) సర్వేకు జిల్లాలో శ్రీకారం చుట్టారు. తొలివిడతగా శ్రీ సత్యసాయి జిల్లాలోని 165 గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దీంతో ఇప్పటి వరకు 15 గ్రామాల్లో సర్వేను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పూర్తి చేశారు. ఈ గ్రామాల్లోని ప్రజలకు త్వరలో యాజమాన్య హక్కు పత్రాలను అధికారులు అందించనున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న గ్రామకంఠాల సమస్య తీరనుంది.

స్వమిత్వ‌తో యాజమాన్య హక్కు

- గ్రామాల్లో ఆస్తుల సర్వేకు ప్రభుత్వం శ్రీకారం
- జిల్లాలో తొలివిడతలో 167 గ్రామాల ఎంపిక

గ్రామకంఠాల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు ప్రాపర్టీ కార్డులు

కొత్తచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2020లో స్వమిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులను కూడా విడుదల చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను ఇతర అవసరాలు, ప్రచారానికి వాడేసింది. దీంతో గ్రామాల్లో సమిత్వ సర్వే నత్తనడకన సాగింది. దీంతో కేంద్రం అసంతృప్తి చెంది నిధుల విడుదల ఆపేసింది. సర్వేను రాష్ట్ర నిధులతోనే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఏళ్ల ఇబ్బందులకు స్వస్తి

గ్రామ కంఠాల్లో ఇళ్లు, ఇతర ఆస్తులకు హక్కు పత్రాలు లేకపోవడం, ఆ ఆస్తులు అవసరాలకు ఉపయోగపడనందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం సమిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలోని 165 గ్రామాల్లో సర్వేను ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలు, విలేజ్ సర్వేయర్లతో చేపట్టింది. ఇందులో భాగంగా కొత్తచెరువు పంచాయతీ కేంద్రంలో దాదాపు 30 సర్వే నెంబర్లలోని ఇళ్లు, ఖాళీ స్థలాల సర్వే నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ సర్వేతో ఆస్తి హక్కు పత్రాలు చేతికి వచ్చి ఊరట కలగనుంది.

జిల్లాలో సర్వే వివరాలు

జిల్లాలో డ్రోన్ ఫ్లై సర్వే పూర్తయిన గ్రామ పంచాయతీలు 178. గ్రౌండ్ ట్రూతింగ్ (సర్వేచేస్తున్న)గ్రామ పంచాయతీలు 165. ప్రాపర్టీ కార్డులను గత ప్రభుత్వంలో 13 గ్రామ పంచాయతీలకు అందించారు. అయితే వాటిపై మాజీ సీఎం జగన్ బొమ్మ ఉండటంవల్ల చాలా మంది ప్రాపర్టీ కార్డులను తిరస్కరించినట్లు సమాచారం. ఈ కార్డులను మార్చి ప్రభుత్వ రాజముద్ర ఉన్న కార్డులను అందించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్రాపర్టీ కార్డులు

గ్రామకంఠాల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు ప్రాపర్టీ కార్డులను(యాజమాన్యపు హక్కుపత్రాలను) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించనున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య తీరనుంది. ఈ కార్డులతో హక్కుదారులు కుటుంబ అవసరాలకు బ్యాంక్‌లో రుణాలు తీసుకోవచ్చు లేదంటే విక్రయించుకోవచ్చు. స్వమిత్వ సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించి ఇళ్లు, ఖాళీ స్థలాల వివరాలను అందించాలి. దీంతో సర్వేలో తప్పులు దొర్లే అవకాశం ఉండదు.

-సమత, డీపీఓ



రికార్డుల్లో తొలగించాలి

స్వమిత్వ సర్వే పూర్తయిన వారికి యాజమాన్య హక్కు పత్రాలు ప్రభుత్వం అందిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో గ్రామకంఠం, దేవదాయ, శోత్రియం కిందనే చాలా గ్రామ పంచాయతీల్లో భూములు ఉన్నాయి. వాటిని రికార్డుల్లో మార్చినపుడే ఆ యాజమాన్య హక్కు పత్రానికి విలువ ఉంటుంది. లేకపోతే ఆ హక్కు పత్రానికి బ్యాంక్ కూడా లోన్ ఇవ్వదు. గత ప్రభుత్వం గ్రామకంఠం, దేవదాయం కింద ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి ప్రజలకు హక్కు పత్రాలను అందజేసింది.అయితే సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో గ్రామకంఠం, దేవదాయం పేర్లను తొలగించలేదు. పస్తుత సర్వే ద్వారా వీటన్నింటిని సరి చేయాలి.

-రామాంజి, ఎమ్మార్పీఎస్ నాయకుడు

నేడు పుట్టపర్తికి టీడీపీ త్రిసభ్య కమిటీ

- పార్లమెంటరీ కమిటీ నియామకంపై కసరత్తు
- ఆశావహుల నుంచి వినతుల స్వీకరణ



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాట్లు

పుట్టపర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంపై దృష్టిపెట్టిన అధినేత సీఎం చంద్రబాబు నాయుడు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఈనేపథ్యంలో పార్టీ జిల్లా కమిటీల నియామకానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం టీడీపీ పార్లమెంటరీ త్రిసభ్య కమిటీ పుట్టపర్తి రానుంది. పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులు మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలకులుగా హాజరుకానున్నారు. పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుకు టీడీపీ కసరత్తు నేపథ్యంలో జిల్లాలోని మంత్రి, టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కమిటీ సభ్యులు, మార్కెట్ యార్డు చైర్మన్లు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర కార్యదర్శులు, మండల కన్వీనర్లు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు హాజరుకానున్నారు. అందరి అభిప్రాయాల మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యుల నియామకానికి ప్రతిపాదనలు స్వీకరిస్తారు. రాష్ట్ర కమిటీలో చోటుకోసం ఆశావహుల నుంచి వినతులను స్వీకరించనున్నారు. పార్టీ కమిటీ నియామకం కసరత్తు నేపథ్యంలో జిల్లా నుంచి ఆశావహులు తమ విన్నపాలను త్రిసభ్య కమిటీ ముందు విన్నవించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందరి అభిప్రాయాలను స్వీకరించి త్రిసభ్య కమిటీ రాష్ట్ర నాయకత్వానికి నివేదించనున్నారు. పార్లమెంటు కమిటీల నియామకం పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలన్న టీడీపీ అధిస్థానం ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు టీడీపీ కార్యాలయం మామిళ్ళకుంటలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించనుంది. జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆశావహులు ఇప్పటికే జిల్లాలోని మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో మంతనాలు సాగిస్తూ మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు.



హిందూపురం సమీపంలో వ్యవసాయేతర భూమిగా మారిన పొలం

అభివృద్ధికి ఊతం

- నాలా చట్టం రద్దుపై హర్షం
- అక్రమాలకు చెక్
- స్థానిక సంస్థలకు ప్రయోజనం
- సులభంగా అనుమతులు

హిందూపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నాలా (వ్యవసాయేతర భూమి పన్ను) చట్టం కింద వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు రియల్టర్లు, యజమానులు.. రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులకు ఎకరాకు రూ.లక్షల్లో సమర్పించుకునేవారు. నాలా చట్టం ఉందన్న సాకుతో సంబంధిత అధికారులు ముక్కుపిండి వసూలు చేసేవారు. అంతేకాదు భూమి కన్వర్షన్ చేయించుకోవాలంటే రాజకీయ నాయకులకు కూడా మామూళ్లు ఇచ్చుకోవాల్సి వచ్చేది. వ్యవసాయ భూమి స్వరూపం మార్చకుండా కనీసం దానిని చదును చేయకుండా నాలా కింద భూమార్పిడికి దరఖాస్తు చేయాలన్నది నిబంధన. కొంతమంది లేఅవుట్లుగా మార్చిన తరువాత ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకునేవారు. అలాంటి వాటికి భూమి విలువపై వసూలు చేసే ఐదుశాతం ఫీజు, మరో ఐదు శాతం జరిమానాగా వసూలు చేయాల్సి ఉంటుంది. జరిమానా, నగదును ప్రభుత్వానికి చెల్లించకుండా రెవెన్యూ అధికారులు ముడుపులుగా తీసుకునేవారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుండేవారు. నాలా రూపంలో ప్రభుత్వానికి అందే ఆదాయంలో స్థానిక సంస్థలకు పైసా కూడా వెళ్లలేదన్న విమర్శలున్నాయి. నిరభ్యంతర పత్రం నిమిత్తం గ్రామ పంచాయతీకి వెళ్లినపుడు అక్కడ కూడా కొంతమొత్తం సమర్పించుకోవాల్సి ఉండేది. కూటమి ప్రభుత్వం ఇటీవల నాలా చట్టాన్ని రద్దు చేయడంపై రైతులు, రియల్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏకీకృత విధానం

స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేలా, స్థానిక సంస్థలకు కొత్తరూపు కనిపించేలా కూటమిప్రభుత్వం చర్యలు తీసుకుంది. నాలా చట్టం రద్దుచేసి ఇక నుంచి ఏకీకృత విధానంలో భూమి మార్పిడికి అనుమతులు ఇవ్వబోతోంది. మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీలకు అనుమతుల రూపంలో వచ్చే ఆదాయం మళ్లేలా ప్రణాళికలు రూపొందించనుంది. నాలా కింద చెల్లిస్తున్న ఐదు శాతం ఫీజును నాలుగు శాతానికి తగ్గించడంతో రియల్టర్లకు ప్రయోజనం చేకూరనుంది. అనుమతుల రూపంలో అన్ని స్థాయిల్లో జరుగుతున్న అవినీతి దందాకు కొంతవరకు అడ్డుకట్ట పడబోతోంది.

నిబంధనల్లో మార్పులు

నాలా చట్టం అమలులో వచ్చిన మొదట్లో ల్యాండ్ కన్వర్షన్‌కు భూమి విలువలో 9శాతం ఫీజు వసూలు చేసేవారు. గత ప్రభుత్వం దానిని మూడు శాతం తగ్గించి మళ్లీ ఐదుశాతం పెంచింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల క్రితం నిబంధనల్లో మార్పు చేసింది. గతంలో ల్యాండ్ కన్వర్షన్‌కు ఆరు నెలలు పట్టేది. ఇప్పుడు తహసీల్దార్ వద్ద 14 రోజులు, ఆర్డీఓ వద్ద 21 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా సడలించింది. నాలాచట్టం రద్దుతో ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియ ఊపందుకోనుంది. అనుమతులు ఏకరూప ప్రక్రియకు తోడు పట్టణాభివృద్ధి సంస్థల్లో డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేయనున్నారు. వచ్చే మొత్తాన్ని రహదారులు, మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. తద్వారా స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతమిచ్చినట్లు అవుతుంది. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోనుంది. వ్యవసాయ భూములు అమ్ముకోవాలనుకునే రైతులకు ఎంతో లాభదాయకం. నాలా చట్టం రద్దు చేయడంతో వ్యవసాయ భూముల ధరలు మరింత పెరిగే అవకాశం పుష్కలంగా ఉన్నాయి.

సర్వత్రా హర్షం

2006లో తెచ్చిన నాలా చట్టం రద్దు చేయడంపై రైతులు, రియల్టర్లు భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లతోపాటు పలు విభాగాల్లో పనిచేసే కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కొన్నిరంగాలు జోరందుకోనున్నాయి.

ఖనిజం నిగ్గుతేలేనా..?

- అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కర్నూలు జిల్లాలో పట్టుబడడంతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించని అధికారులు



శ్రీనివాస మినరల్స్ క్రషర్ వద్ద ఖనిజ నిల్వల కొలతలు వేస్తున్న అధికారులు (ఫైల్)

యాడికి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖనిజ రవాణాకు సంబంధించిన పర్మిట్ పేపర్లలో టెక్నాలజీని ఉపయోగించి మార్పులు, చేర్పులు చేసి ప్రభుత్వ ఆదాయానికి కొందరు మైనింగ్ యజమానులు, ఎండీఎల్ ట్రేడర్లు భారీగా గండికొడుతున్నారు. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన ఒక మైనింగ్ యజమానికి చెందిన మూడు డోలమైట్ అక్రమ రవాణా లారీలను ఇటీవల కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద రీజనల్ విజిలెన్స్ అధికారులు పట్టుకోవడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. డోలమైట్ ఖనిజ అక్రమ రవాణాపై అప్రమత్తమైన కర్నూలు విజిలెన్స్ అధికారులు యాడికి మండలం దైవాలమడుగు గ్రామం వద్ద సదరు గని వద్ద డోలమైట్ ఖనిజ నిల్వలను, శ్రీనివాస మినరల్స్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎంత మొత్తంలో డోలమైట్ ఖనిజం అక్రమ రవాణా (మిగతా 7లో...)

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులందరూ పాల్గొంటారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలపై అర్జీలు అందించాలన్నారు.



నాటేందుకు సిద్ధం చేసుకున్న వరినారు

పుడమి పులకింత

ధర్మవరంరూరల్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మహిళలు జానపదాలు పాడుతూ.. లేత నారును భూమిలోకి నాటేస్తుంటే.. పచ్చాపచ్చని తన అందాలను చూసుకుని పుడమి తల్లి పులకించిపోతోంది. ఎక్కడ చూసినా వరినాట్లతో పచ్చదనాన్ని పరచుకుంటోంది. బోరుబావులకు వర్షంనీరు తోడుకావడంతో రైతులు వరినాట్లపై దృష్టిసారించారు. ధర్మవరం మండలంలోని వసంతపురం, గరుడంపల్లి, చిగిచెర్ల, పోతులనాగేపల్లి, మల్లాకాల్వ చిన్నూరబత్తలపల్లి, వెంకటతిమ్మాపురం, రేగాటిపల్లి, కుణుతూరు గ్రామాలు వరి సాగు చేస్తున్నారు. ఎటుచూసినా పొలాలు పచ్చగా.. కోనసీమను తలపిస్తున్నాయి.



వసంతపురం వద్ద కొండప్ప పొలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

అరబిక్ రెస్టారెంట్‌లో ఎంగిలి బిర్యానీ..!

- తినగా మిగిలినది మరొకరికి సరఫరా
- నిర్వాహకుల కక్కుర్తి
- కిలోల కొద్దీ కుళ్లిన ఆహార పదార్థాల నిల్వ
- కమిషనర్ తనిఖీతో బట్టబయలు


కుళ్లిన చికెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్‌కుమార్

కదిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బయట అందమైన సోఫాలు, కుర్చీలు, టేబుళ్లతో విలాసంగా కనిపిస్తున్న ఆ హోటల్లో.. లోపల చూస్తే జీవితంలో ఇక బిర్యానీ ముట్టుకోరు.. కదిరి పట్టణ నడిబొడ్డున ఉన్న అరబిక్ రెస్టారెంట్‌లో కుళ్లిన పదార్థాలతో పాటు కస్టమర్లు తిని మిగిలిన పదార్థాలను కూడా తర్వాత వారికి వడ్డిస్తున్నారంటే ఎంత దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు చేయడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. కుళ్లిన ఆహార పదార్థాలు, ఫ్రిజ్‌లో గడ్డకట్టిన చికెన్, మాంసం కనిపించాయి. మూటలు మూటలుగా ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలు మూలుగుతున్నాయి. తినగా మిగిలిన బిర్యానీ భద్రంగా దాచిపెట్టి, ఇతరులకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. మురుగునీటి పక్కనే తందూరి చికెన్ కడ్డీలు పెట్టారు. రెస్టారెంట్‌లో ఉన్న వంటగది అపరిశుభ్రంగా కంపు కొడుతోంది. వంటగదిలో కంపు కొట్టే మాంసం, చేపలు, మసాలాలు ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయి. అరబిక్ రెస్టారెంట్‌పై అనేక ఫిర్యాదులు అందడంతో కమిషనర్ తనిఖీలు చేశారు. ఫ్రిజ్‌లో ఉన్న చికెన్‌ను తీయడానికి కూడా మున్సిపల్ సిబ్బందికి వీలుకాలేదు. డబ్బాలకొద్ది మసాల పేస్టులు తయారు చేసి, ఫ్రిజ్‌లో పెట్టేశారు. వాటి వాసన చూసి మున్సిపల్ సిబ్బంది ముక్కులు మూసుకున్నారు. ముందు రోజు ఇతరులు తినగా మిగిలిన బిర్యానీ ముక్కలతోపాటు అన్నం కూడా భద్రతగా దాచిపెట్టారు. చెడిపోయిన చికెన్‌ను వేడి నీటితో శుభ్రం చేసి, తిరిగి ఉపయోగించడం అధికారుల కంటపడింది. తందూరి కడ్డీలను ఎప్పుడు సిద్ధం చేశారోకానీ.. సింక్ (చేతులు శుభ్రం చేసుకునే) ప్రాంతం వద్ద అలాగే వదిలేశారు. పురుగులు పట్టిన ఆహార పదార్థాలను చూసి అధికారులు విస్తుపోయారు. రోజుల తరబడి నిలువ ఉంచిన ఆహారాన్ని ప్రజలకు ఏవిధంగా సరఫరా చేస్తున్నారని యజమానులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. అరబిక్ రెస్టారెంట్‌లో ఆహార కల్తీపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశామన్నారు. తినగా మిగిలిన ఆహార పదార్థాలు, కుళ్లిన చికెన్, మటన్ గుర్తించామని అన్నారు. వెంటనే రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

సెల్ఫీ తెచ్చిన తంటా...

- కొండ పైనుంచి లోయలో పడిన తమిళనాడు వాసి
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు


విఘ్నేష్‌ను బయటకు తీస్తున్న ఫైర్ అధికారులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సెల్ఫీ పిచ్చితో ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు ఓ యువకుడు. ఆదివారం పట్టణం పక్కనే ఉన్న లక్ష్మీనరసింహ స్వామి కొండ అంచువరకు సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లిన తమిళనాడు వాసి విఘ్నేష్ జారి లోయలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడు జిల్లాలోని సోమందేపల్లి వద్దగల కియ అనుబంధ పరిశ్రమ డాంగులో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లాడు. కొండపై ప్రకృతి అందాలతో సెల్ఫీ తీసుకునే పిచ్చిలో కొండ అంచువరకు వెళ్లాడు. అక్కడి నుంచి జారి లోయలో పడిపోయాడు. వెంటనే అతడి స్నేహితులు.. అగ్నిమాపక శాఖాధికారులకు లొకేషన్ షేర్ చేశారు. పెనుకొండ ఫైర్ ఎస్ఓ వెంకటేశులు.. సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని, రెస్క్యూ ఆపరేషన్ చేసి, తాళ్లసాయంతో విఘ్నేష్‌ను పైకి తీసుకొచ్చారు. అప్పటికే కాలు, చేయి విరిగినట్లు గుర్తించారు. 108 సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఖనిజం నిగ్గుతేలేనా..?

(5వ పేజీ తరువాయి)


క్రషర్ వద్ద నిల్వ ఉంచిన డోలమైట్ ఖనిజం

జరిగిందో నివేదికలు తయారు చేయడానికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఈనెల 18, 19తేదీల్లో రికార్డులు, ఖనిజం నిల్వలను పరిశీలించారు. డోలమైట్ ఖనిజం అక్రమ రవాణాపై ఏమి చర్యలు తీసుకున్నది ఇంతవరకూ అధికారులు వెల్లడించలేదు.

ఏమిటీ ఎండీఎల్..?

ఖనిజ రవాణాకు సంబంధించి మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) పొందాల్సి ఉంటుంది. వీటిని మైన్స్ అండ్ జియాలజీ అధికారుల నుంచి పొందాలి. ఫ్యాక్టరీల యజమానులే కాకుండా ట్రేడర్స్ కూడా ఎండీఎల్‌లు తీసుకొని ముడి, పొడి ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా విక్రయాలు చేయవచ్చు. ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలకు రవాణాచేసే సమయంలో రవాణా చేసే వాహనం ట్రాన్సిట్ ఫాంను వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈ ట్రాన్సిట్ ఫాంలో రవాణా చేసే ఖనిజం వివరాలు, తేదీ, సమయం, క్యూఆర్‌కోడ్ ఉంటుంది. ఖనిజాన్ని అక్రమ రవాణా చేసే ఖనిజ టన్నేజీని మార్పు చేసి దందాను కొనసాగిస్తున్నారు. ట్రాన్సిట్ ఫాంలో పదుల సంఖ్యలో ఉన్న టన్నేజీని సింగిల్ డిజిట్‌లోకి మార్చేస్తున్నారు. రాయల్టీ అధికారులను బురిడీ కొట్టిస్తూ యథేచ్ఛగా ఖనిజ అక్రమ రవాణా దందా కొనసాగిస్తున్నారు.

ఎలా మార్పు చేస్తున్నారంటే..

ఉదాహరణకు ట్రాన్సిట్ ఫాంలో 35 టన్నులకు తీసుకొని దానిని 3.5 టన్నులుగా మార్పు చేసుకుంటున్నారు. ట్రాన్సిట్ ఫాంలో 30 టన్నులు ఉంటే దానిని 3.0 టన్నులుగా మార్పు చేస్తున్నారు. ట్రాన్సిట్ ఫాంలో మార్పు చేసుకున్న విధంగా కేవలం 3 టన్నులకు మాత్రమే రాయల్టీ చెల్లించి మిగిలిన టన్నేజీకి రాయల్టీని ఎగ్గొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలా కోట్ల రూపాయల రాయల్టీని ఎగవేస్తున్నారు.

పట్టుబడ్డారిలా..

యాడికి మండలం దైవాలమడుగు గ్రామం వద్ద శ్రీనివాస మినరల్స్ నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్దకు డోలమైట్ ఖనిజ రవాణా వాహనాలను కర్నూలు రీజనల్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయడంతో అక్రమ ఖనిజ రవాణా దందా వెలుగులోకి వచ్చింది. వాహనాల్లో తరలుతున్న ఖనిజ టన్నేజీకి, ట్రాన్సిట్ ఫాంలో ఉన్న టన్నేజీకి వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో మూడులారీలను సీజ్ చేశారు. అనంతరం తాడిపత్రి మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో కలిసి శ్రీనివాస మినరల్స్ వద్దకు వచ్చారు. మైన్స్ వద్ద నిల్వచేసిన ఖనిజాన్ని కొలతలు వేసి రికార్డులను పరిశీలించడంతో దందా వెలుగులోకి వచ్చింది.

నివేదిక ఆధారంగా చర్యలు



దైవాలమడుగు గ్రామం వద్ద శ్రీనివాస మినరల్స్ నుంచి డోలమైట్ ఖనిజం అక్రమ రవాణా జరుగుతున్నట్లు కర్నూలు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అక్కడ తనిఖీలు నిర్వహించారు. ఖనిజ నిల్వలపై సర్వే చేశారు. కర్నూలు విజిలెన్స్ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు చేపట్టాలనేది తెలుస్తుంది. ఖనిజం అక్రమ రవాణా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు తప్పవు.

-ఓబులరెడ్డి, ఏడీఏ, గనులు భూగర్భవనరుల శాఖ, తాడిపత్రి

తెనగల్లు.. టీచర్లకు పుట్టినిల్లు..!

- ఒకే గ్రామంలో 9 మందికి కొలువులు
- అందరూ పేద కుటుంబాలకు చెందినవారే..
- ఇప్పటిదాకా 40 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక


ఎస్. లక్ష్మణమూర్తి


జె. జ్యోతి


కె. శ్రీకాంత్


బండి తేజ


యశ్విని భాను


పి. నీలకంఠేశ్వరప్ప


హరీష్


గంగాధర


కె.సురేశ్ బాబు


చంద్రశేఖర్

కుందుర్పి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం పేరుచెబితేనే ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తుకు వస్తాయి. ఉపాధ్యాయ పోస్టులకయితే అది పుట్టినిల్లుగా మారింది. కుందుర్పి మండలంలోని తెనగల్లు గ్రామానికి చెందిన నిరుద్యోగులు డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో తెనగల్లుకు చెందిన 9 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఆ గ్రామంలో టీచర్ పోస్టులకు ఎంపికయిన వారు 40 మంది దాకా ఉన్నారు. అందరూ మధ్య తరగతి, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు చెందిన వారే. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 9 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. జిల్లా స్థాయిలో.. ఎస్. లక్ష్మణమూర్తి ఎస్ఏ ఫిజిక్స్‌లో 57.57 మార్కులతో 282వ ర్యాంక్, జె. జ్యోతి ఎస్‌జీటీ 85.95 మార్కులతో 54వ ర్యాంక్, కె. శ్రీకాంత్ ఎస్‌జీటీ 84.51 మార్కులతో 86వ ర్యాంక్, బండి తేజ ఎస్‌జీటీ 88.88 మార్కులతో 23వ ర్యాంక్, యశ్విణీ భాను ఎస్ఏ బయాలజీ 78.44 మార్కులతో 31వ ర్యాంక్, పి.నీలకంఠేశ్వరప్ప ఎస్ఏ సోషల్ 76.45 మార్కులతో 51వ ర్యాంక్, హరీష్ ఎస్ఏ పీఈటీ 76.5 మార్కులతో 85వ ర్యాంక్, గంగాధర ఎస్ఏ సోషల్ 73.04 మార్కులతో 92వ ర్యాంక్, కె. సురేశ్‌బాబు ఎస్ఏ పీడీ 92 మార్కులతో 2వ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా మండల పరిధిలోని కరిగానిపల్లికి చెందిన చంద్రశేఖర్ ఎస్ఏ తెలుగు 76.47 మార్కులతో 33వ ర్యాంక్ సాధించారు. ఇతడే పీజీటీ జిల్లా స్థాయిలో 68.60 మార్కులతో 201వ ర్యాంక్ సాధించారు. రెండు ఉద్యోగాలకు అర్హత సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయినప్పటికీ ఆత్మస్థైర్యంతో కష్టపడి చదివి విజయం సాధించారు.

ఒకరికే... మూడు ఉద్యోగాలు


సాయి చందన

కళ్యాణదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న ముత్యాలప్ప మొదటి కుమార్తె ఆర్. సాయి చందన ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. టీజీటీ బయాలజీ జోన్-4లో 81.79 మార్కులతో 5వ ర్యాంక్, అనంతపురం జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 83.13 మార్కులతో 8వ ర్యాంక్, ఎస్‌జీటీలో 84.54 మార్కులతో 84వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించినట్లు ఆమె తెలిపారు.

అత్త ప్రోత్సాహంతో మూడో ర్యాంకు


గంజి రాశి

కూడేరు(ఆంధ్రజ్యోతి): టీచర్ కావాలన్న లక్ష్యంతో నిరంతరం శ్రమించిన గంజి రాశికి అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారం తోడవడంతో డీఎస్సీ ఎస్టీటీ పోస్టుల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించారు. కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన గంజి రాశి చదువుల్లో బాగా రాణిస్తుండటంతో కుటుంబ సభ్యులు ప్రోత్సాహం దక్కింది. గ్రామంలో సెంటు భూమిలేని ఆ నిరుపేద కుటుంబానికి చదువుల తల్లే దిక్కయింది. డీఎస్సీ-2018లో 72.63 కటాఫ్ మార్కులు కాగా.. గంజిరాశికి 72.53 రావడంతో కేవలం 0.10 అతి తక్కువ మార్కులతో ఉద్యోగం చేజారింది. దీంతో ఏడాది క్రితం అనంతపురంలో అద్దె ఇంట్లో ఉంటూ.. ఏడాది క్రితం పుట్టిన చంటి బిడ్డను అత్త వద్దనే వదిలి సాయిగంగ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. టెట్ పరీక్షలో 150 మార్కులకు 149.56 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో 100 మార్కులకు గంజి రాశికి 92.46 మార్కులు రావడంతో జిల్లాలో మూడో ర్యాంక్ సాధించి ఎస్టీటీ పోస్టు దక్కించుకుంది. దీంతో ఉద్యోగం సాధించిన కోడలికి అత్త నీలమ్మ స్వీట్ తినిపించింది. అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారంతోనే తాను టీచర్ పోస్టు సాధించానని ఆమె తెలిపారు. ఆమె భర్త మధు ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

మద్దకవారిపల్లిలో నలుగురికి..


ఎం. విష్ణువర్ధన్


ఎ.చంద్రకళ


బి. వెంకటరమణ


సి.గీతాంజలి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామంలో నలుగురికి ఉపాధ్యాయ పోస్టులు రాగా.. వారిలో ఒకతను ఏకంగా నాలుగు పోస్టులకు ఎంపికయ్యారు. మండలంలోని తంగేడుకుంట పంచాయతీ మద్దకవారిపల్లిలో డీఎస్సీ పరీక్షల్లో నలుగురు ఉపాధ్యాయ పోస్టులను దక్కించుకున్నారు. మద్దక విష్ణువర్ధన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు 78.5 మార్కులతో 24వ ర్యాంకు, టీజీటీ ఇంగ్లీషులో 75 మార్కులతో 70వ ర్యాంకు, సోషియల్ 72.16 మార్కులతో 62వ ర్యాంకు, ఎస్‌జీటీ తెలుగు 86.2 మార్కులతో 161వ ర్యాంకు, చంద్రకళ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సులో 82.53 మార్కులతో 4వ ర్యాంకు, టీజీటీ సైన్సులో 67.5 మార్కులతో 40వ ర్యాంకు, జె. వెంకటరమణ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో 77.34 మార్కులతో 37వ ర్యాంకు, ఎం. గీతాంజలి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో 75.5 మార్కులతో 101వ ర్యాంకు సాధించి, ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వీరితోపాటు ఇదే పంచాయతీలోని బుచ్చిరాజుపల్లికి చెందిన ఎ. సోముశేఖర్ టీజీటీ సోషియల్‌లో, తంగేడుకుంట హర్షియాబాను ఎస్టీటీ పోస్టులు సాధించారు.

పీఈటీ మొదటి ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం


ఉమామహేశ్‌ను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించిన ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. అనంతరం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేయడంతో ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి తమ కలను నెరవేర్చుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ ఇచ్చి ఎంతో మంది నిరుద్యోగులకు బాసటగా నిలవడంతో వారు ఉద్యోగాలు సాధించారని కొనియాడారు.

తోపుడుబండి వ్యాపారి కూతురికి రెండు ఉద్యోగాలు


పార్వతి

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): తోపుడు బండి వ్యాపారి కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపికయింది. నగరంలోని పాతూరులో నివాసముంటున్న తోపుడుబండి వ్యాపారులు శ్రీనివాసులు, మంగాదేవిలకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురుని చదవించకోలేక వివాహం చేశారు. రెండోకూతురు పార్వతిని తోపుడుబండి వ్యాపారం చేస్తూనే డిగ్రీ, డీఈడీ చదివించారు. పార్వతి కష్టపడి చదివి గత నెలలో విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉద్యోగానికి ఎంపికయింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లోనూ 83.28 మార్కులు సాధించి ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయింది. టెట్‌లోనూ 150 మార్కులకు గాను 139 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని పార్వతి తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైనా...ఎస్టీటీగా వెళ్తానని అన్నారు. తమ కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.


తోపుడుబండి వద్ద వ్యాపారం చేస్తున్న పార్వతి తల్లిదండ్రులు

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

అనంతపురం క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యూరియా స్టాక్ ఉన్నా..నో స్టాక్ బోర్డు పెడితే..కఠిన చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు పలు ప్రాంతాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో దాడులు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ఆరు షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఉన్న స్టాక్‌కు, ఈపోస్ మిషన్లలో ఉన్న వివరాలకు తేడా ఉన్నట్లు గుర్తించారు. రూ.15.37 లక్షల విలువ చేసే వివిధ రకాల 60.18 మెట్రిక్ టన్నుల ఎరువులను తాత్కాలికంగా అమ్మకాలు చేయరాదని వ్యాపారులకు నోటీసులు ఇప్పించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, జమాల్ బాష, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, ఎస్ఐలు గోపాలుడు, నరేంద్ర భూపతి, ఏఓలు శ్యాంసుందర్‌రెడ్డి, ఓబిరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- ఫ్యాన్స్ అరెస్టు, స్టేషన్లకు తరలింపు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక వైపున ఎన్టీఆర్ ఫ్యాన్స్, పోలీసుల మధ్య తోపులాట

అనంతపురం క్రైం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యాఖ్యలకు నిరసనగా.. ఆయన క్యాంపు కార్యాలయం ముట్టడికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం యత్నించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీగా వాహనాల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అనంతపురం తరలివచ్చారు. పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ అభిమానులను అడ్డుకుని, స్టేషన్లకు తరలించారు. కొంతమంది అభిమానులు నగరంలోని శ్రీనగర్ కాలనీలోగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నించారు. ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఫ్యాన్స్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి, స్టేషన్లకు తరలించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. ఇతర ప్రాంతాల నుంచి అభిమానులు వస్తున్నారంటూ... ప్రచారం సాగడంతో ఉదయం నుంచీ మధ్యాహ్నం 2 గంటల వరకూ హైటెన్షన్ నెలకొంది. పోలీసు బలగాలు సైతం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ పహారా కాస్తూ... గడిపారు.

సిగ్గు.. సిగ్గు..!

(5వ పేజీ తరువాయి)

ఖర్చు పెడుతున్నాయి. పుస్తకాల నుంచి యూనిఫాం, చివరకు పౌష్టికాహారం వరకు సర్కారు బడుల్లో చదువుతున్న పిల్లలకు ఉచితంగా అందజేస్తూ ప్రతినెలా రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారు. అలాంటి పాఠశాలలకు నిధులిచ్చి పర్యవేక్షించే విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాల పరిస్థితి మాత్రం జిల్లాలో దారుణంగా ఉంది. ఈ రెండు శాఖలకు సొంత భవనాలు లేవు. పరాయి భవనాల్లో నడుపుతున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోయినా ఆయాశాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ భవనాలు ఇతర శాఖలకు చెందినవి కావడంతో వారు తమ భవనాలు ఇచ్చేయాలంటూ ఒత్తిడి తెస్తుండడం శోచనీయం. ఇక వివిధ పనుల మీద ఆయా కార్యాలయాలకు వచ్చే టీచర్లు అక్కడ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలు చూసి షాక్ అవుతున్నారు.

ఎయిడెడ్ పాఠశాలలో..


ప్రభుత్వ శాఖల్లోనే అత్యధిక మంది ఉద్యోగులు విద్యాశాఖలో ఉంటారు. నెలకు సరాసరిగా ఈ శాఖకు చెందిన టీచర్లు, అధికారులు, ఉద్యోగులకు రూ.10కోట్లకుపైగా వేతనాల రూపంలో చెల్లిస్తారు. అలాంటి కీలక శాఖకు సొంత భవనంలేదు. కమలానగర్‌లోని సొంత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు వచ్చినపుడు మార్చాలని సీరియస్‌గా ఉచిత సలహా ఇచ్చి వెళ్లారు. అద్దెలు కట్టలేమనడంతో గిల్డ్ ఆఫ్ సర్వీస్ ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన ఓ భాగాన్ని మరమ్మతులు చేయించుకుని, అక్కడ కొన్నేళ్లుగా డీఈఓ కార్యాలయం నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న గదుల్లో జిల్లా అధికారులు ఉండాల్సి వస్తోంది.

సమగ్రశిక్షదీ ఇదే దుస్థితి..

పాఠశాలల అభివృద్ధి, కొత్తభవనాల నిర్మాణం, వసతుల కల్పన, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, రవాణాభత్యం తదితరాలను సమగ్రశిక్ష శాఖ ద్వారానే అందజేస్తారు. ప్రతినెలా ఆ శాఖ పరిధిలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, వివిధ కేడర్ల సిబ్బందికి రూ.3.50 కోట్లు జీతాల రూపంలోనే చెల్లిస్తున్నారు. భవనాలు, ల్యాబ్‌లు, డార్మెటరీలు, మైదానాలు, క్రీడలు తదితరాల నిర్మాణాలకు ఏటా కనీసం వంద కోట్ల వరకు జిల్లాలో వ్యయం చేస్తున్నారు. అలాంటి సమగ్రశిక్ష శాఖ కార్యాలయానికి సొంత భవనం లేదు. గతంలో ప్రైవేటు అద్దె భవనాల్లో నడుపుతుండేవారు. అద్దె ఎందుకు చెల్లించాలని నగరానికి దూరంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ శాఖకు చెందిన ఓ శిక్షణ కేంద్రంలో నడుపుతున్నారు. అక్కడ కూడా గదులకు పైకప్పులు రేకులతో వేసుకుని, కాలం వెళ్లదీస్తున్నారు. వర్షంవస్తే అవి కారుతున్నాయి. భవనాలను ఖాళీచేసి వెళ్లాలని ఎస్సీ కార్పొరేషన్ శాఖ నుంచి ఒత్తిడి ఉంది. వేరే అవకాశం లేక అధికారులు, సిబ్బంది వాటిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా జిల్లాలో అత్యంత కీలకమైన విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖలకు సొంత కార్యాలయాలు లేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.


కమలానగర్‌లో ఉన్న పాత డీఈఓ కార్యాలయం

పాత కార్యాలయం స్థానంలో నిర్మిస్తే అనుకూలం



కమలానగర్‌లో ఉన్న డీఈఓ పాత కార్యాలయాన్ని కూల్చి, అక్కడే విద్యాశాఖ, ఎస్ఎస్ఏకి కొత్త భవనాలు నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుంది. కీలకమైన కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం బాధాకరం. వెంటనే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తభవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

-నాగేంద్ర, యుటీఎఫ్ సీనియర్ నేత


విలువైన స్థలాన్ని కాపాడాలి



కమలానగర్‌లో డీఈఓ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని వసతులులేని మరోచోట నిర్వహిస్తున్నారు. పాత కార్యాలయం స్థలంలో చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని, వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే కోట్ల విలువ చేసే స్థలం అన్యాక్రాంతమవుతుంది. వెంటనే పాత కార్యాలయాన్ని పడగొట్టి, ఆ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించాలి.

-కులశేఖర్ రెడ్డి, ఏపీటీఎఫ్ నేత


కొత్త కార్యాలయం నిర్మించాలి



డీఈఓ కార్యాలయంలో కనీస వసతులేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కార్యాలయ భవన నిర్మాణానికి పాలకులు, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

- డీవీఎస్ ప్రకాష్‌రావు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకుడు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



డీఈఓ కార్యాలయానికి సొంతభవనం లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. స్వయంగా వచ్చి డీఈఓ కార్యాలయాన్ని పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఆ తర్వాతనే సొంతభవనం ఏర్పాటుపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

న్యూస్ బాక్స్

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

బత్తలపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసులు, డీసీడీఓ సురేష్‌కుమార్, ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ట్రేడర్స్, మోహన్ ట్రేడర్స్, మంజునాథ్ ట్రేడర్స్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు రికార్డులు పరిశీలించారు. రికార్డులలో చూపిన నిల్వలకు గోడౌన్‌లో ఉన్న నిల్వలకు తేడా ఉండడంతో రూ.13.46 లక్షల విలువచేసే 52.2 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి సంయుక్తంగా సెప్టెంబరు 7వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరాం తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆదివారం పట్టణంలోని స్వాతిక్లినిక్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి వంకదారి మోహన్, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో రాణించిన యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న బండి మల్లికార్జున

ముదిగుబ్బ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో ఎస్‌జీటీ విభాగంలో 21వ ర్యాంక్‌తో డీఎస్సీలో రాణించిన యువకుడిని పలువురు సన్మానించారు. ఎస్‌జీటీ విభాగంలో 21వ ర్యాంక్ సాధించిన మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌కు చెందిన జానగాని శివకుమార్ ఇంటికి టీడీపీ స్థానిక నాయకుడు, కురుబ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి మల్లికార్జున ఆదివారం వెళ్లారు. శివకుమార్‌ను శాలువతో సత్క రించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వైద్యం హరినాథ్ స్వామి, వైద్యం మంజునాథ్ స్వామి, బషీర్, బెల్లం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం మండల కమిటీ ఎంపిక

గాండ్లపెంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులవారిపల్లిలో ఆదివారం బలిజ సేవాసంఘం మండల కమిటీని ఆ సంఘం కదిరిజోనల్ అధ్యక్షుడ చిం తకుంట రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా కంచం చలపతి, గౌరవాధ్యక్షుడిగా చెన్నక సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కుంచె మల్లి కార్జున, కోశాధికారిగా పూల మురళి, సభ్యుడిగా ఎలగనీటి రామమోహన్‌ను ఎంపిక చేశారు. బలిజల సమస్యలపై పోరాడి పరిష్కరించడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో శెట్టివారి భైరిశెట్టి, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



లత మృతదేహం

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఓ మహిళ ఆదివారం అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంజయ్ నగర్‌కు చెందిన రాము, ఆయన భార్య బీరే లత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. లత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. పలు ఆసుపత్రులలో చికిత్స లు చేయించుకుంది. అయినా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు తిరుమలేశు, కుమార్తె కనిక ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



హాజీవలీ మృతదేహం

కదిరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న ఇంట్లో విద్యుదాఘాతంతో హోటల్ సర్వర్ హాజీవలి(24) ఆదివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మరణించాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని సున్నంబట్టీ వీధికి చెందిన హాజీవలి స్థానిక అరబిక్ రెస్టారెంట్‌లో సర్వర్‌గా పనిచేస్తుండేవాడు. స్నేహితులతో కలిసి మోర్ సూపర్ మార్కెట్‌కు ఎదురుగా ఓ ఇంటిపై అద్దెకుండేవాడు. రెస్టారెంట్‌లో శనివారం రాత్రి పని ముగించుకుని, గదికొచ్చాడు. అక్కడ భోజనం చేసిన తరువాత తిన్న కవర్లను బయట పడేస్తున్న సమయంలో బయట ఉన్న 11 విద్యుత్ వైర్లకు చేయి తగలడంతో షాక్ కొట్టి మెట్లపై పడిపోయాడు. వెంటనే అతడిని స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి అన్వర్‌బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో చేపపిల్లల విడుదల



దేవరచెరువులోకి చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

కదిరి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దేవరచెరువులో ఆదివారం చేప పిల్లలను వదిలారు. మాజీ సర్పంచ్ ఓరాతి చంద్ర రూ.రెండు లక్షలు విలువచేసే చేప పిల్లలను చెరువులో వదిలారు. రాష్ట్రంలో కుల వృత్తులను ప్రోత్సహిస్తూ, ఆయా కులాల ఆర్థిక బలోపేతానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు పీవీఆర్ గణేష్‌కిరణ్, జి. మనోహర్, ఎస్. జయచంద్ర, పి. పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, పూర్ణచంద్ర, కేశవ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో నీరు పారేదెలా..?

- కంపచెట్లతో పూడిపోయిన కాలువ
- ఆక్రమణలతో కుంచించుకుపోయిన వైనం
- వర్షం వస్తే ఇళ్లలోకి వస్తున్న నీరు
- శాశ్వత పరిష్కారం చూపాలి: స్థానికులు



ఇరిగేషన్ కాలువలో పెరిగిన ముళ్లకంపలు

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న ఇరిగేషన్ కాలువ కంపచెట్లతో నిండి, పూడిపోయింది. దీనికి తోడు కాలువలోకి వర్షపు నీరు రాకుండా కొందరు దిబ్బలు వేశారు. మరి కొందరు ఆక్రమంగా కట్టడాలు కట్టారు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు కాలనీలో ఉన్న ఈ కాలువలోకి రాకుండా అక్రమణలు అడ్డుగా ఉన్నాయి. దీనికితోడు కాలువలో ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఈ రెండు కారణాల వల్ల వర్షపు నీరంతా కాలువకు దగ్గరలో ఉన్న నివాస గృహాల్లోకి చేరుతోంది. దీంతో కాలనీవాసులు వర్షం వచ్చినప్పుడల్లా చాలా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే గాకుండా, రోడ్డుకు అడ్డంగా ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో వంకలకు వరద పోటెత్తడం, ఇళ్లు మునగడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి దాదాపు 15ఏళ్ల నుంచి కాలనీలో ఉంది. వరద సమస్యకు శాశ్వత పరి ష్కారం చూనే దిశగా చర్యలు చేపట్టిన పాపాన పోలేదు. కనీసం ఇరిగేషన్ కాలువలో పెరిగిన ముళ్లకంపలను తొలగిస్తే సమస్య కొంచెమైన తగ్గుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇరిగేషన్ కాలువ వద్ద ఆక్రమణలను తొలగించి వెడెల్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. ప్రతియేటా వర్షాకాలం వచ్చిందంటే భయంభయంగా కాలం నెట్టుకొస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



30 అడుగుల రోడ్డుపై నిర్మించిన ఇల్లు

మురుగు కాలువలను వెడల్పు చేయాలి



లక్ష్మీచెన్నకేశవపురంలో ఇరిగేషన్ కాలువ కుంచించుకుపోయింది. దీంతో మురుగు, వర్షపు నీరు కలిసి రోడ్డుపైకి చేరుతోంది. వర్షం వస్తే నీరు ఇళ్లలోకి చేరుతోంది. చాలా సార్లు అధికారులకు. ప్రజాప్రతినిధులకు తెలియజేశాం. అధికారులు వస్తారు.. కాలువ వద్ద కొలతలు వేస్తారు... వెళ్తారు. మళ్లీ వాటి గురించి పట్టించుకోరు. ప్రధానంగా డ్రైనేజీ కాలువలను విస్తరించాలి. అప్పుడే ఈ సమస్య కొంతైనా పరిష్కారం అవుతుంది.

-రాకేశ్, లక్ష్మీచెన్నకేశవపురం

వర్షం వస్తే నీరు ఇళ్లలోకి చేరుతోంది



ప్రతిసారి వర్షం వచ్చినప్పుడల్లా నీరు ఇళ్లలోకి వస్తోంది. దీంతో రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తోంది. మా ఇంటికి ఎదురుగా కాలువ ఉంది. అయితే వర్షపు నీరు ఆ కాలువ వెంబడి వెళ్లదు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరంతా మా ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లలోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

-పెద్దన్న, లక్ష్మీచెన్నకేశవపురం

ఆక్రమణల వల్లే...

లక్ష్మీచెన్నకేశవపురంలోని ఇరిగేషన్ కాలువ ముళ్లకంపలతో నిండిపోయింది. దాని వల్లనే వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందనడం అవాస్తవం. వర్షాలు వచ్చినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు కాలువలోకి వెళ్లకుండా అడ్డంగా వేసిన దిబ్బలు, అక్రమ కట్టడాలే నీరు ఇళ్లలోకి వెళ్లేందుకు ప్రధాన కారణం. కాలువలో ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే కాలువలో పెరిగిన కంపచెట్లను తొలగిస్తాం.

-గురుప్రసాద్, జేఈ, ఇరిగేషన్

ఆవుల అపహరణ

తనకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాసానిపల్లిలో ఆదివారం తెల్లవారుజామున రాజేంద్రనాయుడు అనే వ్యక్తికి చెందిన రెండు పాడి ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు, గ్రామస్థులు తెలిపారు. రాజేంద్రనాయుడు రోజు మాదిరిగానే తన రెండు పాడి ఆవులను గ్రామంలోని తన ఇంటి పక్కన కొట్టంలో శనివారం సాయంత్రం కట్టివేశాడు. ఆదివారం ఉదయం అక్క డికి వెళ్లగా రెండు పాడి ఆవులు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికాడు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో గాలించాడు. ఆదివారం చింతా మణిలో పశువుల సంత ఉండడంతో అక్కడికీ వెళ్లి వచ్చాడు. ఆవుల ఆచూకీ లభ్యంకాలేదు. వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందన్నారు. సెంటు భూమిలేని ఈ కుటుంబం పాడి ద్వారా జీవనం సాగిస్తున్నారు. తనపాడి ఆవుల చోరీపై తనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లికి చెందిన దారా సోమ శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. సోమశేఖర్ ద్విచక్రవాహనంలో చౌడేపల్లి నుంచి మహమ్మ దాబాద్ క్రాస్ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి ఎడమకాలు పూర్తిగా దెబ్బతింది. స్థానికులు అతడిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

- జేవీవీ జిల్లా మహాసభలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



సమావేశంలో మాట్లాడుతున్న గేయానంద్

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెరగాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓహోంలో ఆదివారం జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి అధ్యక్షతన జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ... ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీ ఉంటాయన్నారు. సమాజంలో మంచి వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతూ కొత్త మూఢనమ్మకాలు ముం దుకు వస్తున్నాయన్నారు. పర్యావరణం పెద్దసమస్యగా మారిందన్నారు. విద్యావ్యవస్థలో సృజనాత్మకతకు స్థానం లేకపోగా ర్యాంకులకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. పిల్లలను పరిశోధనల వైపు ప్రోత్సహించడం సన్నగిల్లిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు కార్పొ రేట్ల చేతుల్లో చిక్కుకుని వాళ్లకు లాభాలు తెచ్చిపెట్టే వనరులుగా మారిపోయాయన్నారు. ఈ మార్పులను అవగాహన చేసుకుని జేవీవీ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సభలో జేవీవీ రాష్ట్రకోశాధికారి రాజశేఖర్‌రాహుల్, డాక్టర్లు బషీర్, ఈటీ రామ్మూర్తి, జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సానే రవీంద్రారెడ్డి, నాయకులు నర్సారెడ్డి, చైతన్య గంగిరెడ్డి, గౌస్‌లాజం, సురేశ్, సంజీవప్ప, లక్ష్మీనారాయణ, షర్ఫుద్దీన్, మహేశ్, లోకేశ్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం తరలింపు అపోహే

- బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం మార్పుపై ఇటీవల వస్తున్న వదంతులు కేవలం అపోహ మాత్ర మే నని, వాటిని నమ్మాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడెసె దేవానంద్, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన గుడెసె దేవానంద్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రం మార్పుపై ఇటీవల కాలంలో వస్తున్న వదంతులు కేవలం అపోహ అన్నారు. జిల్లా కేంద్రం తరలింపు గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని, క్యాబినెట్ సమావే శంలో చర్చ జరగలేదన్నారు. ఈ వదంతులను నమ్మాల్సిన అవసరం లే దని వారు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతిప్రసాద్, కోశాధికారి సురేంద్రబాబు, కార్యదర్శి కుసుమ జయరాం, ఐటీసెల్ కన్వీనర్ భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, నాయకులు బాల గంగాధర్, గొడుగు నాగరాజు, శేషాద్రి నాయుడు, దళిత మోర్చా నాయకులు గంగిశెట్టి, అనిల్‌కుమార్, విష్ణు, పట్టణ కమిటీ సభ్యులు కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్విచ్‌లు ర్పాటు చేయండి సారూ..!



కొత్తచెరువు సబ్‌స్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న ఏవీ స్విచ్‌లు

కొత్తచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ లైన్లకు ఏవీ స్విచ్‌లు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏవీ స్విచ్‌లు లేకపోవడం వల్ల విద్యుత్ సమస్య వస్తే మొత్తం గ్రామమంతా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలు, వ్యాపా రులు, చిన్నచిన్న పరిశ్రమలపై ఆధారపడి జీవించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఏవీ స్విచ్‌లను సరఫరా చేసినా వాటిని ఆ శాఖ అధికారులు ఏర్పాటుచేయకుండా సబ్‌స్టేషన్‌లోనే మూలన పడేశారు. దీంతో అవి వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపట్టిపోతున్నాయి. గ్రామాల్లో విద్యుత్ లైన్లకు ఏవీ స్విచ్‌లు చేర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏవీ స్విచ్‌లు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

తనకల్లు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌లో కొంతమంది యువత రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకుని సత్యన్నసేనను ఏర్పాటు చేశారు. ఈ పేరుతో 38 నెలలుగా నిరుపేదలైన గర్భిణులకు ప్రతినెల పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఆదివారం కొక్కంటిక్రాస్‌లోని ఆరుగురు నిరుపేదలకు పౌష్టికాహారం అందించారు. గర్భిణులకు నెలలు నిండేవరకు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యన్నసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠ శాలలో 1993-94లో పదో తరగతి చదివిన విద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత అందరూ ఒకచోట చేరారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలురకాల వృత్తులు, ఉద్యోగాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడిన వారు ఒకచోట చేరడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

కేజీబీవీ తనిఖీ



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముదిగుబ్బ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ని ఎంపీడీఓ నసీమా, పంచాయతీ కార్యదర్శి మంజుల, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పౌష్టికాహారం అందజేత, సిబ్బంది, టీచర్ల పనితీరుపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీలో పౌష్టికాహారం అందజేయడంలో లోపం తీవ్రంగా ఉందన్నారు. రాగిపిండి లేకుండా బాలికలకు రాగిముద్దలు వడ్డిస్తున్నారన్నారు. మొదటి పిరియడ్ అయిపోయినా టిఫిన్ ఇవ్వడం లేదని, మెనూ పాటించడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే వంటకాలు చేసేటప్పుడు చదువుతున్న బాలికలతో పను చేయిస్తున్నారని తెలిసిందన్నారు. వంట సిబ్బంది తరచూ గొడవ పడుతుండడం వల్ల చదువుకోవడం చాలా కష్టంగా ఉందని బాలికలు అధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. పై సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



పడమర తాలూకా కార్యవర్గం

కదిరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కదిరి పడమర తాలూకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పి. వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పడమర యూనిట్ సంఘం అధ్యక్షుడిగా పి. వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి. హరినాథ్‌ని ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి ఇంజనీర్ పి.వెంకటరె డ్డి తెలిపారు. అలాగే జాయింట్ సెక్రటరీగా ఎం. శ్రీనివాసాచారి, ట్రెజరర్‌గా వి. శ్రీనివాసులు, జిల్లాకౌన్సిల్ సభ్యులు జి. శ్రీనివాసరెడ్డి, ఎస్. అబ్దుల్‌రహీమ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే కదిరి తూర్పు యూనిట్ సంఘం అధ్యక్షుడిగా ఎస్.తాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా కె. రామానాయక్, ప్రధాన కార్యదర్శి ఎస్. మహబూబ్ బాషాను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణ తెలిపారు. అలాగే జాయింట్ సెక్రటరీగా డి. గంగాధరం, ట్రెజరర్‌గా టి. మల్లికార్జున, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బి. అశోక్‌కుమార్, జేఎస్ అబుబాకర్‌సిద్ధిక్‌ను ఎన్నుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.



తూర్పు తాలూకా కార్యవర్గం

సిగ్గు విడిచి ఎన్డీఏకు వైసీపీ మద్దతు

- కాంగ్రెస్ పార్టీ నాయకులు

కదిరి అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థికి మద్దతు ఇచ్చేందుకు వైసీపీ నాయకులకు సిగ్గుండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎస్ షానవాజ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో వైసీపీ బీజేపీ కోసమే పనిచేస్తోందని ఈ మద్ధతుతో మరోసారి రుజువైంద న్నారు. రాష్ట్రంలో కూటమి పక్షాలతో కుస్తీ పడుతూ, ఢిల్లీలో మాత్రం ఎన్డీఏకి వైసీపీ మద్దతు ఇస్తోందన్నారు. అవినీతి కేసులకు బయపడి బీజేపీకి మళ్లీ దాసోహం అవుతోందన్నారు. దేశంలో ఓటు చోరీతో రాజ్యాంగం ఖూనీ అవుతుంటే, వైసీపీకి కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆయనతోపాటు సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా వాజ్‌పేయి క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 పోటీలు ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో నాయక్ వారియర్స్, చత్రపతి శివాజీ లెవన్స్ జట్లు తలపడగా ఇందులో 28 పరుగుల తేడాతో నాయక వారియర్స్ జట్టు గెలిచింది. రెండో మ్యాచ్‌లో కొత్త చెరువు గాంధీనగర్ లెవన్స్ జట్టుపై బసంపల్లి జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరచిన పరశురాం, సోముకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ, బీజేపీ నాయకులు శ్యామరావు, పోతుకుంట రాజు, సోమ్లానాయక్, చిన్నలింగమయ్య, పోతుకుంట శ్రీనివాసులు, కోళ్లమొరం భాస్కర్ రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ ఆడుతున్న దృశ్యం

కదిరి అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ క్రికెట్ కోచ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీ లు నిర్వహించారు. ఎ, బి జట్ల మధ్య ఎంతో ఉల్లాసంగా సాగిన ఈ పోటీల్లో మొదట బ్యాటింగ్ చేసిన బి - జట్టు 40 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి. 159 పరుగులు చేసింది. వీరిలో కెప్టెన్ తరుణ్ 98, సంతోష్ 29 పరుగులతో రాణించారు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎ- జట్టు కేవలం 88 పరుగులకే ఆల్ అవుట్ అయింది. విజయం సాధించిన బి- జట్టును కదిరి మండల క్రికెట్ సంఘం సభ్యులు ముబారక్, యల్లప్ప, విజయ్ అభినందించారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

పెనుకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పసరవక్కరి బావి ఒడ్డున కొత్తగా నిర్మించిన ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోండి: ఏఐఎస్‌ఏ

పెనుకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సెలవు రోజుల్లో కూడా పాఠశాల నిర్వహించే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకుని పాఠశాలను మూయించినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఇలాంటి యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ నాయకులు అనిల్, పునీత, రోహిత్‌నాయక్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు, బాబావలి, భగత్ పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

పరిగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పరిగి చెరువులో వన్నంపల్లి వద్ద గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. చెరువులో మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. వృద్ధురాలి వయసు 65ఏళ్లు ఉంటుందని, మృతిచెంది మూడు రోజులై ఉంటుందని నిర్ధారించారు. వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని వివరించారు.

పావగడ(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజనందన్ హోటల్ వెనుక గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ సౌందర్యం.. అద్భుతం

లేపాక్షి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని సీబీఐ న్యాయమూర్తి గజానన్‌భట్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయన్ను దుశ్శాలువలతో సన్మానించారు. ఎస్‌ఐ నరేంద్ర, దేవాదాయ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

బ్రహ్మకుమారీల రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న రమేష్

హిందూపురం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న బ్రహ్మకుమారీ నిలయంలో ఆదివారం రక్తదానశిబిరం నిర్వహించారు. రాజయోగిని ప్రకాశ్‌మణి దాది 15వ స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ హాజరై రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

డీఎస్సీలో 19వ ర్యాంక్



హరికృష్ణ

గుడిబండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలం కెఎన్‌పల్లి గ్రామానికి చెందిన నాగమ్మ, వైకుంఠప్ప దంపతుల కుమారుడు హరికృష్ణ డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 19వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి'

పెనుకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సెప్టెంబరు 15న ఆర్డీటీ పరిరక్షణ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పులికేకను విజయవంతం చేయాలని అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బీఎస్‌ఆర్ దాస్ హాజరై ప్రసంగించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పులికేక నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, పెద్దన్న రాయలసీమ కన్వీనర్ శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ, క్రిష్టప్ప, గంగాధర్, గోపీనాథ్, శివరామక్రిష్ణ, ఎంఎస్ మూర్తి పాల్గొన్నారు.

బ్యాంకు డైరెక్టర్ ఎన్నికల్లో ఎమ్మెల్యే విజయం



విజయం సాధించిన వెంకటేశ్

పావగడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా కేంద్ర సహకార, డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ గెలుపొందారు. ఆదివారం పావగడ నుంచి 20మంది తమ ఓటు హక్కుని వినియోగించాల్సి ఉంది. ఇందులో ఒక ఓటు ఇన్‌వాలిడ్ కాగా మరొకరు గైర్హాజరయ్యారు. దీంతో 18మంది ఓటర్లలో 14మంది కాంగ్రెస్‌కు, నాలుగు ఓట్లు జేడీఎస్ లభించాయి. ఎమ్మెల్యే గెలుపుపట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు అందని ప్రత్యామ్నాయ విత్తనాలు

ఆందోళనలో అన్నదాత



ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం చేసిన పొలం

మడకశిర, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వర్షాభావం కారణంగా పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు వర్షం కోసం ఎదురుచూసినా పడక పోవడంతో సాగుచేయలేదు. అయితే పది రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యారు. నేటికీ రైతులకు విత్తనాలు అందుబాటులోకి రాలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు రాలేదు. వర్షాలు పడుతుండడంతో కొంత మంది రైతులు బయట మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతయేడు వేరుశనగ పంట దెబ్బతినడంతో ఈఏడు పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని ఆశించిన రైతులకు వర్షంపడక పోవడంతో నిరాశ ఎదురైంది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి వేరుశనగ పంట సాగు కోసం పొలాలను దున్ని దుక్కులు చేసుకుని ఎరువులు, విత్తనాలు అన్ని సమకూర్చుకున్నారు. అయితే వరుణదేవుడు కరుణించకపోవడంతో తాము పంటసాగు చేయకనే నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వర్షాలు పడడంతో కొంత మంది రైతులు వేరుశనగ పంటపై ఆశ చావక దేవుడిపై భారం వేసి వేరుశనగను సాగు చేశారు. కొంత మంది రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో గతంకంటే సాగు విస్తీర్ణం బాగా తగ్గింది.

80వేల హెక్టార్లలో పంటల సాగు

వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో జిల్లాలో 2.19 లక్షల హెక్టార్లలకుగాను అన్నిరకాల పంటలు కలిపి 80 వేల హెక్టార్లలోనే సాగయ్యాయి. ఇందులో 42వేల హెక్టార్లలోనే వేరుశనగ, మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేశారు. గత యేడు కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు అంటున్నారు. అలసంద, ఉలవ, పెసర, జొన్న విత్తనాలకు వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

11వేల హెక్టార్లకు ప్రతిపాదనలు

మడకశిర నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 34, 300 హెక్టార్లలో నార్మల్ ఏరియా ఉండగా అందులో వర్షాభావం కారణంగా 23, 200హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. మడకశిర మండలంలో 5003 హెక్టార్లు, రొళ్లలో 4900, గుడిబండలో 4896, అమరాపురంలో 4516, అగళి మండలంలో 3810 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. 11వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

మార్కెట్‌లో కొనుగోలు చేశా



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. గత సంవత్సరం వర్షాభావం కారణంగా వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో నష్టపోయా. ఈయేడు కూడా వేరుశనన సాగు చేసి అప్పులు ఊబిలో నుంచి బయటపడదామని ఆశించి వేరుశనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటే వర్షం కురవలేదు. ఆగస్టు మొదటి వారంలో వర్షాలు పడ్డాయి. దీంతో ప్రత్యామ్నాయ పంటను సాగు చేద్దామనుకున్నా. అయితే విత్తనాలు అందుబాటులోకి రాలేదు. దీంతో బయట మార్కెట్ లో ఉలవలు కొనుగోలు చేసి ఎకరాలో సాగు చేశా. రూ. 10వేల దాకా ఖర్చయ్యింది. అధికారులు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేసివుంటే ఇంత ఖర్చయ్యేదికాదు.

-ఈరన్న, రైతు, జీరిగేపల్లి

ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో 60వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాల్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరం అవుతాయి. ఈ మేరకు ప్రతి పాదనలు పంపాం.

-వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

గణపయ్యల ఏర్పాటుకు సర్వం సిద్ధం

ముస్తాబవుతున్న మండపాలు



విక్రయానికి ఉంచిన వినాయక విగ్రహాలు

మడకశిర టౌన్/రూరల్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బొజ్జగణపయ్యలను ప్రతిష్ఠించేందుకు ఆదివారం నుంచే సర్వం సిద్ధం చేస్తున్నారు. వాడవాడలా బొజ్జగణపయ్యలు ఏర్పాటుచేసేందుకు పచ్చనితోరణాలు, పందిళ్లతో సుందరంగా మండలపాలను ముస్తాబు చేస్తున్నారు. బుధవారం వినాయకచవితి కావడంతో బొజ్జగణపయ్యలను ప్రతిష్ఠించనున్నారు. అందుకోసం వాడవాడలా సర్వాంగ సుందరంగా మండపాలను అలంకరిస్తున్నారు. దాదాపు 20 చోట్ల బొజ్జగణపయ్యలు ప్రతిష్ఠించేందుకు విశేషంగా మండలపాలు సిద్ధం చేస్తున్నారు. గణపయ్యలను ప్రతిష్ఠించేందుకు రెండు రోజులు మాత్రమే ఉండడంతో యువకులు గణపయ్యలను కొనుగోలుచేసి గ్రామాలకు తీసుకువెళ్తున్నారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు సస్యశ్యామలం కావాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని విశేష పూజలు చేపట్టి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణంలో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు పచ్చని తోరణాలు, మిరుమిట్లు గొలిపే దీపాలతో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేశారు. బొజ్జగణపయ్యలు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన కిషోర్ అనే వ్యక్తి పట్టణంలోని పావగడ రోడ్డులో ఆకర్షణీయమైన ఆకృతులలో వినాయక విగ్రహాలను విక్రయానికి ఉంచారు. దీంతో గ్రామస్థులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. 3 నుంచి 25 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను సైతం సిద్ధం చేసి ఉంచారు. ఒక విగ్రహం రూ. 25వేల వరకు విక్రయిస్తున్నట్లు కిషోర్ తెలిపాడు.

అగ్రంపల్లికి ప్రత్యేకస్థానం

వినాయక విగ్రహాల తయారీలో అగ్రంపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. మట్టి విగ్రహాలు మొదలు పెద్ద విగ్రహాలను కూడా తయారు చేస్తారు. 30 ఏళ్లుగా వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నామని రవితేజ తెలిపారు. కుటుంబ సభ్యులు కలిసి పనిచేస్తామని, ఎవరికి ఎలాంటి విగ్రహం కావాలో తయారు చేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాల తయారీ చేస్తున్నామన్నారు.

45 ఏళ్ల తర్వాత..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎన్ రఘువీరారెడ్డి

మడకశిర టౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978-1980వ సంత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు 45 సంవత్సరాల అనంతరం ఆదివారం మడకశిర జూనియర్ కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాతలుగా మారిన వయసులో వారు ఒక్కచోట చేరి అందరూ సరద సరదగా గడపడం ఓ మరుపురాని అనుభూతిగా నిలిచింది. పిల్లలు, మనవళ్ల, మనవరాళ్లతో సరదగా గడిపిన క్షణాలు మరవలేనివిగా వారు అనుభూతి చెందారు. సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి హాజరు అయి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 45 సంవత్సరాల క్రితం ఈ కళాశాలలో చదివి వివిధ రంగల్లో స్థిరపడిన మీరు ఒక చోట చేరి పాత స్మృతులు, అప్పట్లో గడిపిన క్షణాలను నెమరువేసుకోవడం మరువలేని అనుభూతి అని అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పూర్వపు విద్యార్థులతో కాసేపు సరదాగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి.

హేమావతి పాఠశాలలో 2007-08 బ్యాచ్ విద్యార్థులు



అమరాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని హేమావతి ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యాసంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు హెచ్‌ఎం తిప్పేస్వామి, రిటైర్డ్ హెచ్‌ఎం లింగప్ప, కృష్ణారెడ్డి, నాగరత్న, సురేఖ విశ్వనాథ్, గోపిక, అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలియతిరుగుతూ అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపిక

అగళి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అగళి క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన టోర్నీలో 22 జట్లు పాల్గొన్నాయి. తరిమెల, అగళి జట్లు ఫైనల్స్‌లో తలపడగా అగళి జట్టు విజయం సాధించింది. విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో ఈ జట్టు పాల్గొననుంది. అర్షాత్‌ఖాన్, మారుతి, యశ్వంత్, లోహిత్, నవీన్ కుమార్, మంజు, నరసింహ, కరియన్న తదితరులు ప్రతిభ చూపారు.



రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపికైన జట్టు

దేవాలయ నిర్మాణానికి వితరణ

రొద్దం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆర్. మరువపల్లి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది ఆర్ఎన్ హేమేంద్రనాథ్‌రెడ్డి రొద్దకాంబ దేవాలయ నిర్మాణానికి రూ.2.16 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, రామాంజినేయులు, బాచిస్వామి, జనార్దన్‌లకు నగదు అందజేశారు.

వైసీపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

హిందూపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించడంపై వైసీపీ కౌన్సిలర్ ఆసిఫ్‌పై కేసు నమోదైనట్లు వన్‌టౌన్ డీఎస్పీ మహేష్ తెలిపారు. శనివారం రాత్రి 10గంటలు దాటినా శ్రీనివాసటాకీస్ రోడ్డులో షాపు తెరుచుకుని ఉండటంతో అక్కడికి వెళ్లిన వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, సిబ్బంది షాపు బంద్ చేసుకోవాలని సూచించారు. అయితే పోలీసులపైనే దురుసుగా వ్యవహరించి సీఐపైనే ఎదురుతిరిగాడు. దీంతో ఆసిఫ్‌పై కేసు నమోదుచేసినట్లు డీఎస్పీ తెలిపారు. వైసీపీ నాయకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా నిరసన తెలిపారు. దీనిపై కేసు నమోదుచేయడానికి పరిశీలిస్తున్నామన్నారు.

చెరువుకట్టపై చెట్ల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి చెరువుకట్టపై చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జేసీబీతో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు తొలగించారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర మాట్లాడుతూ కొన్నేళ్లుగా కంపచెట్లు, పిచ్చిమొక్కలతో చెరువుకట్ట అధ్వాన్నంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టలేదన్నారు. ఆయకట్టు 500ఎకరాల్లో ఉండగా రైతు పొలాలకు నీరందించే తూమువద్ద పిచ్చిమొక్కలు పొదలతో నిండి నీరు సరఫరా జరగడం లేదని సమస్యను రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయాన్ని మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పనులను చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. అదేవిధంగా చెరువుకట్ట మరమ్మతుల కోసం రూ. 50లక్షల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చెరువు ఆయకట్టు అధ్యక్షులు వడ్డె నారాయణ, ఉపాధ్యక్షులు సాయినాథ్‌రెడ్డి, డైరెక్టర్లు కిష్టప్ప, ప్రభాకర్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మద్దిలేటి, కట్టా మహేంద్ర, వడ్డె శ్రీనివాసులు, సోమశేఖర్, నాగశేషప్ప, నగేష్, మంజునాథ, కిష్టప్ప, తిప్పన్న, నబీ, లక్ష్మీనారాయణ, వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాల శీతలీకరణ కేంద్రం



కంపచెట్ల మధ్య పాల శీతలీకరణ కేంద్రం

రొద్దం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.17.67లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం కంపచెట్లలో దర్శనమిస్తోంది. రొద్దం మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో పెండ్లిజీవికి వెళ్లేరోడ్డులో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం నిరుపయోగంగా మారింది. వైసీపీ హయాంలో ప్రతి పంచాయతీకి పాలశీతలీకరణ కేంద్రాలకు నిధులు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణాలు జరగలేదు. అయితే నారనాగేపల్లి గ్రామంలో పాలశీతలీకరణ కేంద్రాన్ని మాత్రం పూర్తిచేశారు. అప్పటి ప్రభుత్వం వాటిని ఉపయోగించకపోవడంతో కంపచెట్లలో దర్శనమిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆ భవనాన్ని వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆ వీధికి భాస్కర్ పంతులు పేరు



భాస్కర్ పంతులు వీధిని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

హిందూపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట ఏరియాలో ఉన్న ఒక వీధికి గత వందేళ్లుగా భాస్కర్‌పంతులు వీధిగా పిలిచేవారు. దీనిని మున్సిపాలిటీ గెజిట్‌లో చేర్చారు. దీంతో ఆదివారం ఆ వీధికి భాస్కర్ పంతులు వీధి అని నామకరణం చేశారు. ఆ వీధిని ఆదివారం రిబ్బన్ కట్‌చేసి మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మాజీ మునిసిపల్ చైర్మన్ విద్యాసాగర్, మురళి, శివ, చైతన్య, భాస్కర్ పంతులు కుటుంబ సభ్యులు జయలక్ష్మీ, బాలసుబ్రహ్మణ్యం, పణిభూషణ్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ

పరిగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పుట్టగూర్లపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లక్ష్మమ్మకు బాలకృష్ణ అభిమాని గిరీష్ వీల్‌చైర్ వితరణ చేశారు. ఆదివారం లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో కార్తీక్, 8వ వార్డు కౌన్సిలర్ గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- అనంతపురం ఎంపీ అంబికా



వాల్మీకి ఆలయంలో గ్రామస్థులతో ఎంపీ అంబికా

లేపాక్షి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కంచిసముద్రం గ్రామంలో నిర్మిస్తున్న వాల్మీకి, ముత్యాలమ్మ, రామలింగేశ్వర ఆలయాలకు సంబంధించి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి దేవాలయాన్ని సందర్శించారు. అతిపురాతనమైన రామలింగేశ్వరస్వామి ఆలయం, ముత్యాలమ్మ గుడి అభివృద్ధికి కృషిచేయాలని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగలింగారెడ్డి, సదాశివరెడ్డి, తిమ్మగానిపల్లి వెంటకేష్, కొండూరు సర్పంచ్ సిద్దు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

హిందూపురం, (ఆంధ్రజ్యోతి): యశ్వంతపురం నుంచి కాచిగూడ వెళ్లే వందే భారత్ రైలును హిందూపురం రైల్వేస్టేషన్‌లో నిలపడానికి కృషిచేసిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ప్రజాసంఘాల నాయకులు సత్కరించారు. ఆదివారం పట్టణంలోని శ్రీకంఠపురం వద్ద అంబికాను సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్, రామ్మూర్తి, ఉమర్‌ఫారూక్ మాట్లాడుతూ హిందూపురంలో వందేభారత్ రైలు ఆపడం వల్ల ఎంతోమంది మేలు చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌కువెళ్లే ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో టైలర్ గంగాధర్, కృష్ణానాయక్, నాగార్జున, మహేష్, వెంకటేష్, కార్తీ, అశోక్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.